# స్వయంకృతం

చెన్ను సుశీలారామం

7-12-83

**ఆఫీసు నుండి** వచ్చి అలసటగా కుర్చీలో వాలిపోయింది సరిత. ఆ రోజు ఫస్టు తారీఖు. జీతాలిచ్చే రోజు. చేతులు పైట కొంగుకు తుడుచుకుంటూ సరిత తల్లి కామాక్షమ్మ హడావుడిగా వచ్చిందక్కడికి. "ఏమ్మా జీతం తెచ్చావా? ఇలా ఇవ్వు ..." ముఖం నిండా నవ్వు పులుముకుని చెయ్యి చాచింది.

సరిత ముఖం మాడిపోయింది. "వచ్చినజీతమూ మాయమైపోదు. తెచ్చిన నేనూ పారిపోను. ముందుగావో కప్పు టీ తెచ్చి పెట్టమ్మా ... తల పగిలిపోతూంది." సాధ్యమైనంత సౌమ్యంగానే మాట్లాడింది. అంతవరకు ఎరువు తెచ్చుకున్న నవ్వు ముఖాన్న పులుముకుని మాట్లాడుతూన్న కామాక్షమ్మ ముఖాన్ని నవ్వు హంస్ కాకిలా ఎగిరిపోయింది.

"జీతం అడిగితేనే అలా మాట్లాడుతున్నావు టే ... ఈ సంసారంలో ఎన్నో అవసరాలు నన్ను తరుముకొస్తూంటే, నువ్వు ఇచ్చేవరకు ఆగలేక అడిగాను. ఐనా నీ సంపాద నొక్కటే సరిపోతుం దనుకున్నావా? పిచ్చి సన్నాసిబాబు, రెక్కలు ముక్కలు చేసుకోక పోతే నీ జీతం ఏమూల కొస్తుంది? ఆ సంగతి నీకు తెలియదేమిటి? వూ ... నాకూ వోపిక చచ్చిపోతూంది. అందరికీ అన్నీ చేసి కాళ్ళదగ్గర కందించేసరికి నా పనైపోతూంది." విసుక్కుంటూ కూతురికి టీ తేవటానికి లోనికెళ్ళిం దావిడ.

పేడనీళ్ళు ముఖాన కొట్టినట్లయింది సరితకు. అలాంటి తిరస్కారా లన్నింటికీ ఈ మధ్యనే అలవాటుపడింది. ఐనా ... ఎప్పటికప్పుడు ఆమె మనసు బాధతో మూలుగుతూనే ఉంది. ఆ రాత్రి పడుకున్నదే గాని ఎంత సేపటికీ నిద్ర పట్టలేదు. లైటు ఆర్పి ఆలోచిస్తూ మంచం మీద వాలింది. పక్క గది నుండి చిన్నగా మాటలు వినిపించడంతో తప్పని తెలిసీ ... కుతూహలం కొద్దీ మనసు ఆగక లేచి కిటికీ దగ్గర కొచ్చి నిలబడింది. పక్కగదిలో సరిత తమ్ముడు హరిబాబు, అతని భార్య లత పడుకున్నారు. వాళ్ళ పెళ్ళయి సంవత్సర మవుతూంది. తన ప్రవర్తనకు తానే సిగ్గుపడి అక్కడ్నుంచి కదలబోయి, తనపేరు వినిపించడంతో టక్కున ఆగిపోయింది.

"మా అక్కకు పెళ్ళిచేస్తే బాగుంటుంది, లతా! తనదీ చిన్న వయస్సే ... ఎంతకాలమని ఒంటరిగా ఉంటుంది? ఇంక రాజేష్ బావతో కలిసి ఉండటం కల్ల. ఇద్దరికీ ఈ జన్మలో సరిపడదు. అతని దగ్గర్నుండి విడాకులు తీసుకుని, మా అక్కకు ఏదైనా మంచి సంబంధం చూడాలి. రేపు ఒకసారి తన అభిప్రాయం కూడా అడుగుతాను..." హరి గొంతు అది.

తమ్ముడికి తనమీదున్న అభిమానానికి సరిత కళ్ళు చెమర్చాయి. ఇంతలో లత మాట్లాడింది: "మీకు మతి ఉందా, లేదా? ఒట్టిపోయిన ఆవును బైటికి తోలెయ్యాలిగానీ, పాడిఆవును ఎవ్వరూ తెలివి తక్కువగా వదులుకోరు. మీ అక్క నెలనెలా సంపాయించి తెస్తుంటే పెళ్ళిచేసి పంపిస్తానంటారేం? మీకు బుర్ర ఉందా, లేదా? ఆవిడ సంపాయించడం మూలంగానే, మీ జీతంలో సగం మనం



దాచుకో గలుగుతున్నాం. రేపు మనకు పిల్లలు పుడితే, మీవాళ్ళందరి మంచి చెడ్డలూ చూస్తూ కూర్చుంటే, ఇంక మన పిల్లల చేతికి చిప్పేగతి. కాబట్టి మనకు పిల్లలు కలగ్గానే మీజీతంలోంచి పైసా కూడా ఈ కొంపలో ఖర్చు పెట్టడానికి వీల్లేదు. మీ అక్క జీతంతోనే ఇల్లు గడవాలి. తెలిసిందా? మరెప్పుడూ ఆవిడకు పెళ్ళిమాట తల పెట్టొద్దు. ఐనా ... ఒకసారి మొగుడ్ని వదిలేసింది రెండో మొగుడి దగ్గరమాత్రం తిన్నగాఉంటుందా?''

మరదలి మాటలు వాడిగా దూసుకొచ్చి బల్లెంలా సరిత గుండెలో దిగబడి, గిలగిల్లాడిపోయింది. ఇంక అక్కడ నిలబడలేక వచ్చి మంచం మీద వాలి పోయింది. నోరు పిడచకట్టుకుపోతూంది. యాంత్రికంగానే లేచి మంచినీళ్ళ కొరకు టేబుల్ దగ్గర కొచ్చింది. జగ్గు ఖాళీగా ఉంది. జగ్గు తీసు కుని వంటింటి వైపు నడిచింది.

''అమ్మాయ్, సుగుణా! నీతోబాటు రావటానికి నాకు తీరికెక్కడి దమ్మా! అక్కయ్యను తీసుకెళ్ళు'' కామాక్షమ్మ మాట లవి. వంటింటి పక్క గదిలో పడుకుంటున్నారు సరిత తల్లి, చెల్లెలు. చెల్లెలు చంటిబిడ్డ తల్లి.

''ఇంకా నయం. నువ్వు వస్తే రా ... లేకుంటే లేదు. అంతేగాని అక్కనుమాత్రం తీసుకెళ్ళను. అసలే మా ఆయన బుద్ధి మంచిది కాదు. అక్కేమో నాకంటే చాలా అందంగా ఉంటుంది. మొగుడు ముద్దులు, పిల్లాజెల్లాలేక, కన్నెపిల్లలా ఉంది. దాన్నక్కడకు తీసుకెళ్తే ఇంకేమన్నా ఉందా? నా సంసారానికి నీళ్ళొదులుకోవలసిందే. పొరపాటున కూడా దాన్ని నాతో వెళ్ళమని అనకే, అమ్మా... అది వస్తానంటే కొంప మునిగిపోయిందన్నమాటే ...'' సరిత చెల్లెలు మాటలవి.

''నిజమేనేవ్ ... చిన్నదానివైనా ఎంత దూరా లోచన చేశావే ... నేను అంత దూరం ఆలోచించ లేదు సుమా.'' కామాక్షమ్మ అన్నది.


వింటున్నసరిత అణువణువూసిగ్గుతో కుంచించుకు పోయింది. తన శరీరంలో ప్రతి అంగుళం కత్తితో కోసి కారం చల్లినంత బాధగా ఉంది ఆమెకు. ఎవరో హిప్నటైజు చేసినట్లు అక్కడున్న గోడకు అతుక్కు పోయి అలాగే నిలబడిపోయింది. మంచి నీళ్ళ మాట మరిచిపోయి, కాస్సేపటికి వెనుదిరిగి తన గదిలోకి వెళ్ళిపోయి అక్కడున్న పడక్కుర్చీలో వాలిపోయింది. ఆమె ప్రమేయం లేకుండానే కళ్ళ నుండి నీళ్ళు జలజలా రాలుతున్నాయి. ఎందుకో ఆమెకే తెలియని దుఃఖం పెల్లుబికి పోతూంది.

'ఏమిటేది తన అనుకున్న తన వాళ్ళందరి అంతర్యాల నిజస్వరూపాలు ఇంత భయంకరమైనవా? ఎక్కడ జరిగిం దీ లోపం? తన ప్రశ్నలో దోషం ఉందా? తనలో ఉందా? తనేమై పోవాలిప్పుడు? తనకు దిక్కెవరు? తనను వోదార్చే వారెవ్వరు? తన రక్తసంబంధీకులే తన నింత నీచంగా అనుకుంటున్నారా? తను రెక్కలు ముక్కలు చేసు కుని సంపాదిస్తున్న సంపాదనకు ఎంతో గౌరవం ఇస్తారు. కాని, తనను మాత్రం ఇంత నీచాతినీచంగా చూస్తున్నారా? తెల్లారి లేస్తే ఏమీ తెలియనట్లు నటిస్తారే. కాస్తో కూస్తో సంపాదిస్తున్నప్పుడే తన నిలా చూస్తున్నారు. ఏమీ సంపాదించలేనప్పుడు తన పరిస్థితి ఎంత హీనంగా ఉంటుందో. భగవంతుడా ఇలాంటి వాళ్ళకోసమా తన పచ్చని సంసారాన్ని కాలదన్నుకుని వచ్చింది?

వచ్చిన తరువాత తన తప్పు క్షమించమని, తలిదండ్రుల చెప్పుడు మాటలు విని, మంచి చెడు ఆలోచించని మూలంగా అలా ప్రవర్తించానని, ఎప్పటిలా మీ వాళ్ళకు డబ్బు పంపించవచ్చు. వచ్చెయ్యమని ఎన్నో ఉత్తరాలు వ్రాశాడు, మరెన్నో సార్లు తన దగ్గర కొచ్చి బతిమలాడాడు రాజేష్. కాని, తాను ఏం చేసింది? నోటి కొచ్చినట్లు మాట్లాడింది. తన వాళ్ళకు డబ్బు పంపటానికి వీల్లేదన్నాడన్నకోపంతో అతన్ని దూరం చేసు కుంది. ఇదంతా ఎవరి గురించి చేసింది? తనను తన భర్తనుండి దూరం చెయ్యడానికే అతనిమీద ఎన్నో రకాలుగా చెప్పి మనసు విరిచేసింది తల్లి. మొగుడ్నొదిలేసి వచ్చింది కదా! ఏమన్నా, ఎలా ప్రవర్తించినా ఇక్కడే పడుంటుందనుకుంటున్నారు వీళ్ళు.' అనునయించే వాళ్ళు లేక తనలో తనే కుళ్ళి కుళ్ళి ఏడ్చింది.



SAA/HSI/20 TEL




అత్తింటి వారైనా, పుట్టింటివారైనా తనను తానుగా గౌరవించే వాళ్ళనే కాని, తన సంపాదనకు విలువ ఇచ్చే వాళ్ళను నమ్మకూడదని ఇప్పు డర్థం చేసుకుంది ఆమె. ఎవరి కిచ్చే విలువలు వాళ్ళకు ఇవ్వాలని,అంతకు మించితే తన మంచితనాన్నిపిచ్చితనం కింద లెక్క కడతారనీ తెలుసుకుంది. తన కోసం ప్రాకులాడుతూ తనస్థానం మరొకరి కివ్వక, తన గురించే కాచుకునున్న భర్త గురించి ఇప్పటి కైనా ఆలోచించుకునేలా చేశారు ఆమె పుట్టింటి వాళ్ళు.

భర్తనుండి వేరుగా వచ్చేసిన ఐదేళ్ళ నాటి గతంలోకి ఆమె మనసు పరుగులు పెట్టింది.

"ఎక్కడికీ మనియార్డర్ చేస్తున్నావు?" ముఖం చిట్లించి అడిగాడు రాజేష్. మొదటిసారిగా భర్త నోటి నుండి వచ్చిన ఆ ప్రశ్నకు విస్తుపోయింది సరిత. "అదేమిటి అలా అడుగుతున్నావు కొత్తగా? ఎక్కడికి చేస్తాను మా అమ్మకే."

"పూ: ఇంకా ఎంత కాలం ఇలా పంపిస్తావు, సరితా! నీ తమ్ముడూ ఉద్యోగస్థుడయ్యాడుగా?"

ఎవరో కొత్త మనిషిని చూస్తున్నట్టుగా అయోమయంగా చూసింది సరిత భర్తను. అతని ఆంతర్యమేమిటో అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తోంది.

"నువ్వేనా, రాజేష్, ఇలా మాట్లాడుతున్నావు? మా తమ్ముడు ఉద్యోగస్థుడయి ఇంకా ఆర్నెల్లన్నా కాలేదు. అదీగాక నేను పంపిస్తున్నది మా చెల్లెళ్ళ పెళ్ళికని నీకూ తెలుసు. అయినా ఈ రోజు ఎందు కిలా మాట్లాడుతున్నావు?" మనియార్డరు ఫారం ఒక పక్కకు పెట్టి చేతిలో పెన్ను మూసి టేబుల్ మీద పెట్టింది.

"ఇదిగో, సరితా! నువ్వేమీ చిన్నపిల్లవు కావు. అన్నీ వివరంగా చెప్పించుకోవడానికి. మన పెళ్ళైన ఐదేళ్ళ నుండీ మీ వాళ్ళకు డబ్బు పంపిస్తూనే ఉన్నావు. ఇప్పటివరకు నే నేమన్నా అన్నానా? ఇంక రేపో మాపో మనకూ పిల్లలు పుట్టుకొస్తారు. బాధ్యతలు రెట్టింపవుతాయి. సంపాదించింది ఇప్పుడే కాస్త వెనకేసుకోకపోతే మన పిల్లల కేం దారి చూపించగలం?" రాజేష్ భార్యకు నచ్చ చెబుతున్నాడు.

మొదటిసారిగా భర్తలో మరో మనిషిని చూస్తూ నిశ్చేష్టురాలై పోయింది సరిత. అతని ఆంతర్యం అర్థం చేసుకునేసరికి విపరీతమైన కోపం కలిగింది ఆమెకు. కాని తమాయించుకుని సాధ్యమైనంత సౌమ్యంగా మాట్లాడడానికే నిర్ణయించుకుంది.

"చాలా సంతోషం, రాజేష్! నువ్వే అసలైన తండ్రివంటే. ఎప్పుడో పుట్టబోయే బిడ్డల గురించి ఇప్పటినుండీ వాళ్ళకు బంగారు సోపానాలు నిర్మిస్తున్నావే. నన్ను కని, పాతికేళ్ళు పెంచి, నా కాళ్ళమీద నన్ను నిలబడేలా చేసిన వాళ్ళకు నేను ఎంత సాయం చేస్తే వాళ్ళ ఋణం తీర్చుకోగల నంటావు?"

"ఆడపిల్ల పెళ్ళయాకకూడా పుట్టింటి వారి గురించి బాధ పడేదాన్ని నిన్నొక్కత్తినే చూశాను. ఇన్నేళ్ళు సాయపడుతూ వచ్చావు వాళ్ళకు. ఇంతవరకు ని న్నేమన్నా అన్నానా? ఎప్పటి కప్పుడు నువ్వే తెలుసుకుంటావని చూస్తున్నాను. ఇంకా నీకు తెలిసి రాలేదంటే దీనికి నా అలుసేగా కారణం? చెట్టంత నీ అన్నగా రక్కడ తాగి తందనా లాడుతున్నాడంటే నీ అండ చూసుకునే కదా. నువ్వు డబ్బు పంపడం మానేస్తే చచ్చినట్లు ఏదో పని చూసుకుని కుటుంబాన్ని పోషించుకుంటాడు."

"రాజేష్! ఈ రోజు నువ్విలా మాట్లాడుతున్నావంటే... ఈ రోజే నీ నోటి చివరనుండి వచ్చిన మాటలు కావివి. ఎంత కాలంగానో నీ మనసులో ఉన్న భావాలు, ఆలోచనలు అవి. సరే. ఇలాంటి భావం నీ కుందని ఇంతవరకు నేనూ తెలుసుకోలేక పోయాను. ఇప్పుడే తెలుసుకున్నాను గనక భార్యగా నీతో ఏకీభవించి నీకు సహకరించడం నా విధి. దాని కో షరతు పెడుతున్నాను—ఒప్పుకుంటావా?" సరిత సౌమ్యంగానే అడిగింది.

తన మాటలు మత్తు బిళ్ళలా ఆమె మీద

అంత త్వరగా పని చేస్తున్నందుకు ఎంతో సంతోషించాడు రాజేష్. భార్య మీద ప్రేమ రెట్టింపవగా భార్యకు దగ్గరగా టేబులు మీద కూర్చుంటూ హుషారుగా మాట్లాడాడు. "చెప్పు, సరూ. ఏమిటా షరతు—నువ్వు అడగడమూ, నేను కాదనడమూనా?"

టేబుల్ మీదున్న పేపర్ వెయిట్ గిరగిరా తిప్పుతూంది సరిత. "మరేం లేదు. నేను మా వాళ్ళకు ఒక్క పైసాకూడా పంపించను. వాళ్ళ ముఖం చూడను. అలాగే నువ్వుకూడా మీ వాళ్ళను తక్షణం మన దగ్గరనుండి బయటికి పంపెయ్యి. ఒక్క నయాపైసాకూడా వాళ్ళకు హెల్ప్ చెయ్యొద్దు. నీ చెల్లెలూ సంపాదిస్తోంది గదా!" భర్త ఆయువు పట్టుమీదే గట్టి దెబ్బ కొట్టింది. కొంత సేపటి వరకు గుక్క తిప్పుకోలేక పోయాడతను. తేరుకున్న మరుక్షణంలోనే చాలా పెద్ద కోపమే వచ్చింది భార్యమీద.


"ఏమిటి నీ ఉద్దేశం? నీ వాళ్ళు, నా వాళ్ళు ఒకటే అవుతారా? నా చెల్లి సంపాదిస్తుంటేమట్టుకు, ఆడపిల్ల సంపాదన మీద ఆధారపడే తత్వం కాదు నా తలిదండ్రులది."


"అవును. నా తలిదండ్రులు ఆడపిల్ల సంపాదన మీద ఆధారపడిన వాళ్ళే. కొడుకు చాతకాని వాడవటం వల్ల కూతురే ఆధారం వాళ్ళకు. మొదట్లోనే ఆడపిల్ల, మగపిల్ల అన్న భేదం చూపిస్తే నన్ను చదివించి ఇంతదాన్ని చేసి ఉండరు. నా పెళ్ళయి, నా స్వార్థం నేను చూసుకుపోతానన్న దూరాలోచన అప్పుడు వాళ్ళకు కలగలేదు. నా వాళ్ళు, నీ వాళ్ళు ఒకటే అవుతారా అంటున్నావు. ఏం ఎందుకు కారు? మగాడి వని మీ అమ్మ నిన్ను ఒంటినిండా రత్నాలు, వజ్రాలు తాపడం చేసి కనలేదు. ఆడపిల్లనని మా అమ్మ నన్ను ఒంటి నిండా మట్టి పూసి కనలేదు. ఏ బిడ్డైనా తల్లికి ఒకటే. అయినా నీ బుద్ధి ఇంత సంకుచితమైపోయిందేం? ఇలాంటి గొడవ లొస్తాయని మొదట్లోనే చెప్పాను నీకు— నా చెల్లెళ్ళ పెళ్ళయ్యే వరకు, నా తలిదండ్రుల తనువు గడిచేవరకు వాళ్ళకు అండగా ఉంటానని. అప్పుడు నువ్వేమన్నావో ఒక్కసారి జ్ఞప్తి తెచ్చుకో. నీ వాళ్ళు, నా వాళ్ళు అన్న భేదమే లేదు. మనిద్దరివీ ఈ బాధ్యతలన్నీ. మన వాళ్ళందరి మంచి చెడ్డలూ సమాన దృష్టితో చూద్దాము అన్న మనిషివేనా నువ్వు? నా బాధ్యతలన్నీ తీరే వరకూ నేను పెళ్ళి చేసుకోనని అంటే, నా బాధలు అర్థం చేసుకున్న వాడిలా నటించి, నన్ను నమ్మించి మోసం చేశావన్న మాట. కాని ఇప్పటికైనా సరే నిన్నేమీ తప్పు పట్టను. అటువంటి సంకుచితత్వం నీ స్వభావంలోనే ఉన్నప్పుడు, దానికి ఎన్ని తొడుగులు వేసి మూస్తే మాత్రం—అది మన పెళ్ళైన ఇన్నాళ్ళకు బయట పడింది. సరే. నా అభిప్రాయంకూడా చెప్పాలి కదా నీకు. ఎట్టి పరిస్థితుల్లోనూ నా వాళ్ళను దిక్కులేని వాళ్ళుగా చెయ్యను. ఆ బాధ్యతలన్నీ తీరాకనే నీ మాట వింటాను." ఖచ్చితంగా తేల్చి చెప్పేసింది సరిత.

కుత కుత లాడిపోయాడు రాజేష్. తన మాటలు లక్ష్య పెట్టక, తన పెద్దరికం, అధికారం మంట గలిపేసిందన్న ఉక్రోషంతో మనిషి నిలువెల్లా కోపంతో పూగి పోతున్నాడు. "అయితే నాతో తెగ తెంపులు చేసుకోవడానికికూడా సిద్ధమేనా నువ్వు?"

భర్త నోట వచ్చిన ఆ ప్రశ్నకు నిర్విణ్ణురాలైంది సరిత. ఆమెలోకూడా పట్టుదల తలెత్తింది. "నీతో విడిపోటానికి నే నెప్పుడూ సిద్ధంగా లేను. అలాంటి భావం నీకుంటే నేను కాదనను. ఒకవేళ కోర్టు కెళ్ళి, విడాకులు తీసుకుని, మీ అమ్మ నీకు మరొకత్తెను తెచ్చి ముడి పెడతానంటే నా అభ్యంతరమేదీ ఉండదు. ఏం చేసుకుంటావో నీ ఇష్టం వచ్చినట్లు చేసుకో." కుండ పగల గొట్టినట్లుగా చెప్పి మనియార్డరు ఫారం పూర్తి చెయ్యడంలో నిమగ్నమై పోయింది సరిత.

"యూ...యూ..." ఇంకెలా తన కోపం వెళ్ళగ్రక్కుకోవాలో తెలియక పిడికిలి బిగించి టేబుల్




మీద గట్టిగా మోది, అక్కడున్న కుర్చీని ఒక్క తన్ను తన్ని వెళ్ళి పోయాడు రాజేష్.

అలా గొడవ పడి భర్త నుండి వేరుగా వచ్చేసి మరో వూరు ట్రాన్స్‌ఫరు చేయించుకుని, పుట్టింటి వారిని రప్పించుకుని వాళ్ళతో కలిసి ఉండసాగింది సరిత.

* * * *

రాజేష్ నుండి ఎన్నో ఉత్తరాలు వచ్చేవి. "సరూ ఇంకా ఎంత కాలం నా మీద కక్ష సాధిస్తావు? నువ్వు నా నుండి దూరమయి ఐదు సంవత్సరా లవుతుంది. కాదు. ఐదువందల యుగాలైనట్లుంది. ఇంకా నా మీద కోపం పోలేదా? ఏం చేస్తే నీకు నా మీద కోపం పోతుందో చెబితే, ఈ క్షణంలో చేస్తాను. మా వాళ్ళ చెప్పుడు మాటలు విని అప్పుడలా మాట్లాడాను. దానికి ఫలితం ప్రతి క్షణం అనుభవిస్తున్నాను. ఒకరి నొకరం అభిమానించుకోవ డం వల్లనే మన జీవితాల్లో మరొకరికి తావివ్వ లేదు. ఎంత కాలమైనా నీ కోసం ఎదురు చూస్తుంటాను. సరూ! దయచేసి వ న్నర్థం చేసుకో. ఇక మీద అంతా నీ ఇష్ట ప్రకారమే జరుగుతుంది. నువ్వు నాకు కావాలి. జీవితాంతం ఒకరి కష్ట సుఖాల్లో మరొకరు పాలు పంచుకునేది? తోడు నీడగా ఉండేది భార్యా భర్తలని తెలుసుకున్నాను. నీ రాక గురించి ప్రతి క్షణం ఎదురు చూస్తున్నాను." ఇలా ఎన్నో రకాలు బతిమాలుతూ వేడుకుంటూ వ్రాస్తుండే వాడు. వాటి గురించి ఈ మధ్యనే ఆలోచించటం మొదలెట్టింది సరిత.

తన పుటింటివాళ్ళు, వాళ్ళు సృష్టించిన పరిస్థితులే ఆమె నలా ఆలోచనల్లో పడేశాయి. ఆలోచనలన్నీ ఒక రూపాంతరం పొంది ఆమె కోదారి కనిపించింది. దాని ఫలితమే తన భర్త దగ్గర కెళ్ళి పోవటానికి నిశ్చయించుకుని, ఆ శుభ వార్త తన మిత్రురాలు సరోజకు చెప్పి ఆఫీసులో రిజిగ్నేషన్ లెటరు ఇచ్చేసి రావచ్చునని హుషారుగా బయలుదేరింది సరిత.

"సరూ. నీకో గుడ్ న్యూస్. నేను రాజేష్‌తో కలిసి ఉండటానికి నిశ్చయించుకున్నాను. ఇంక అతని సహనాన్ని పరీక్షిస్తూ చేతులారా దూరం చేసుకో లేను. బాస్ రాగానే రిజిగ్నేషన్ లెట రిచ్చి నీకు స్వయంగా చెప్పి వెళదామని వచ్చాను."

ఆనందంతో సరోజ కళ్ళు మెరిశాయి. స్నేహితు రాలి రెండు చేతులూ పట్టుకుని ప్రేమగా నొక్కి వదిలింది. "హమ్మయ్య. ఇప్పటికైనా దారిలో కొచ్చావన్నమాట. ఐయాం వెరీ హేపీ సరితా ఎప్పుడైనా సరే మనం ఎక్కాల్సిన బండిని చేరుకోవ డానికి టైముకు వెళ్ళాలి. లేకుంటే బండి మిస్సై పోతాము. ఇప్పటికే నువ్వు చాలా లేటు చేశావు. రాజేష్ నీ గురించి ఆగి ఉన్నాడు కాబట్టి అది నీ అదృష్టమే అనుకో. ఇంకా తెగేవరకూ లాగకుండా వెంటనే వెళ్ళు."

సరిత మనసంతా సంతోషంతో నిండిపోయి, ఆకాశంలో విహంగంలా ఎగర సాగింది. వాళ్ళిద్దరూ మాట్లాడుకుంటుండగానే ఆఫీసు ప్యూను ఒక లెటరు తెచ్చి సరిత కిచ్చి వెళ్ళాడు. ఆ లెటరు చూడగానే ఆమె కళ్ళు మిలమిలా మెరిశాయి. ముత్యా ల్లాంటి చేతి వ్రాత రాజేష్‌ది. ఆత్రితగా విప్పి చదవసాగింది.

"డియర్ సరితా. అనుకున్నది జరగకపోవడం, అనుకోనిది జరగడం ఆ విధాత నా నుదుట వ్రాశా డేమో. నీ కోసం ఈ జన్మంతా ఎదురు చూదా మనుకున్నాను. కాని ఒక విపత్కర పరిస్థితిలో నీ స్థానం మరొకరి కివ్వాల్సి వచ్చింది." సరిత కాళ్ళు చేతులు దడదడ లాడాయి. గుండె వేగం హెచ్చింది. కాని కళ్ళు మాత్రం అక్షరాల వెంట పరుగు లెత్తాయి.

"చిన్నతనాన్నే నా తండ్రి పోతే నన్ను చదివించి ప్రయోజకుణ్ణి చేశాడు మా మామయ్య. ప్రతిగా ఏ నాడూ ఇది కావాలి. ఈ పని చేసి పెట్టు అని ఎప్పుడూ కోరలేదు. మొన్న మా మామయ్య ఏకైక కూతురు రమ—ఎవరి వల్లనో మోసగించబడి, చావుకు సిద్ధమైతే ఆ సమయంలో అక్కడే ఉన్న నేను ఆమెను రక్షించాను. కాని మామయ్య తీవ్రంగా గుండె పోటుకు గురైనాడు. ఎటూ ఆలోచించుకో లేని, తేల్చుకోలేని పరిస్థితుల్లో మామయ్య మాట తీసెయ్యలేక, ఆయన బాధ చూళ్ళేక ఆయన ప్రాణం దక్కించుకోవడానికై రమ మెడలో మూడు ముళ్ళు వెయ్యాల్సి వచ్చింది. సరితా. నన్ను క్షమి స్తావా." ఆ తరవాత మాటలు కంటి నిండుగా నిండిన నీళ్ళ వల్ల గజిబిజిగా అల్లుకు పోయి ఆమె కంటి కేమీ కనిపించకుండా పోయింది.

తాను కూర్చున్న చోట నేల రెండుగా చీలిపోయి ఆ అగాధంలోకి వేగంగా దొర్లుకు పోతున్నట్టుగా సరిత నిస్సహాయంగా ఉండిపోయింది. సరోజ కేం అర్థంగాక అయోమయ పరిస్థితిలోనే సరిత చేతి లోని లెటరు తీసుకుని గబగబా చదివింది. ఆమెకూ పెద్ద షాక్ తిన్నట్లుగా ఉంది.

ఎంతో కాలంగా ఆశ పెట్టి, ఆ ఆశ పడ్డది అప్పుడే అందుకో బోయేంతలో దాన్ని లాక్కుని, సరిత నోట్లో మట్టి కొట్టి నీ దిక్కున్న చోట చెప్పుకోమన్నా డా దైవం.

ఆఫీస్‌లో బాస్ కివ్వాలని తెచ్చిన లెటరు చిన్న చిన్న ముక్కలుగా చించి వేస్ట్‌బాక్స్‌లో పడేసింది సరిత. హాండ్‌బాగ్ నుండి కర్చీప్ తీసి కళ్ళు, ముఖం తుడుచుకుని, ఫైల్స్ దగ్గరగా లాక్కున్న సరిత కళ్ళకు, తనకు దగ్గరలో ఉన్న కిటికీ గుండా రోజూ కనిపించే దృశ్యమే కనిపించ సాగింది. ఎద్దు కళ్ళకు గంతలుకట్టి కర్రతో కొడుతూ గానుగ ఆడిస్తున్నాడు దాని యజమాని. దాని శ్రమ ఫలితాన్ని నూనె రూపంలో తీసి పిండు కుంటున్నాడు. ఆ ఎద్దులో జవసత్వాలుడిగి, దాని యజమాని దాన్ని కసాయి వాడికి అమ్మే వరకు దాని బతుకంతే. ప్రభుత్వం తనని రిటైర్ చేసి ఉద్యోగం నుండి తొలగించే వరకు తన బతుకింతే" సరిత తలలో ఎక్స్‌ప్రెస్ రైళ్ళు పరుగెడుతున్నంత రొద, హోరు. అంతా గందరగోళంగా ఉంది. ఆమె మెదడంతా మొద్దు బారిపోయి ఏదీ ఆలోచించలేక, అలాగే చూస్తూ ఉండిపోయింది. ★